## క్లుప్తంగా

### కోతులు, కుక్కలు, పందులను పట్టుకోవాలి



**వినుకొండ(నూజెండ్ల):** పట్టణంలో ప్రజలను ఇబ్బంది పెడుతున్న కోతులు, కుక్కలు, పందులను పట్టుకోవాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌కు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని వీధుల్లో డజన్ల కొద్ది కుక్కలు, కోతులు తిరుగుతూ స్కూల్ పిల్లలు, వృద్ధులపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నట్లు తెలిపారు. స్లమ్ ఏరియాల్లో పందులు ఎక్కువగా తిరుగుతున్నాయన్నారు. వెంటనే స్పందించి వాటిని పట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వెంకట అజయ్‌కుమార్, రమేష్‌బాబు, రాజు, సుభాని, మల్లికార్జున, లాజర్, మస్తాన్, వెంకటేస్, భాస్కర్, భాషా తదితరులు పాల్గొన్నారు.

### ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



**బొల్లాపల్లి:** అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. దోమ లార్వాలు, దోమ నిల్వలు లేకుండా నివారించినట్లయితే వాటివల్ల వచ్చే అంటువ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.శంకర్‌నారాయణ, ఎంపీహెచ్ ఈవో ఎస్. రవి, పీహెచ్‌ఎన్. పద్మావతి, ఎంపీహెచ్‌ఎస్ సుమతి, ఏఎన్‌ఎంలు, ఆశలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

### సాతులూరు చర్చి నాలుగో వార్షికోత్సవం



**నాదెండ్ల:** సాతులూరులోని క్రీస్తు కిరణాలు సంఘ చర్చి నాలుగో వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాస్టర్ అమ్మ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాస్టర్ మాట్లాడుతూ క్రైస్తవులు దేవుడి పట్ల సంపూర్ణ విశ్వాసులుగా ఉండాలన్నారు. క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. వార్షికోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులతో పాటూ ఫాస్టర్లు హాజరయ్యారు.

### మిరపలో సస్యరక్షణ చేపట్టాలి

వినుకొండ ఉద్యాన శాఖ అధికారి ఎస్కే నబి రసూల్



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి ఎస్కే నబిరసూల్

**బొల్లాపల్లి:** మండలంలోని ఘాటితండా గ్రామానికి చెందిన పొలాలను సోమవారం వినుకొండ ఉద్యాన శాఖ అధికారి ఎస్కే నబి రసూల్ సందర్శించి మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు మిరప పంటను ఆశించు తెగుళ్ల కీటకాల నివారణ గురించి వివరించారు. వేరుకుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి మొదుళ్లను బాగా తడిపినట్లయితే మొక్కలను కాపాడుకోవచ్చన్నారు. కాయకుళ్లు, కొమ్మ ఎండు తెగులుకు నాటివో 80 గ్రాములు ఒక ఎకరానికి పిచికారి చేయాలన్నారు. బ్యాక్టీరియల్ ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు మరియు ప్లాంటమైసిన్ 1 గ్రాము ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పోషక లోప సవరణకు పైపాటుగా 19-19-19, ఫార్ములా -4, ఫార్ములా -6 మెగ్నీషియం సల్ఫేట్‌ను పిచికారి చేసుకోవాలన్నారు. అదేవిధంగా మిరపలో తెల్లనల్లి, తెల్లదోమ, తామరపురుగు, వైరస్ తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ షేక్ హుస్సేన్, మూడావత్ రవినాయక్, రైతులు పాల్గొన్నారు.



కోటప్పకొండ అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు



శావల్యాపురంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



కోటప్పకొండపై మహానందీశ్వరుడి వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

# ఆలయాల్లో కార్తిక శోభ

- భక్తులతో శివాలయాలు కిటకిట
- పరమేశ్వరునికి ఘనంగా పంచామృతాభిషేకాలు
- కోటప్పకొండలో ప్రత్యేక అభిషేకాలు



నరసరావుపేట ఎన్‌ఎస్‌పీ కాలనీ శివాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రొంపిచర్లలో ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లభేశ్వరస్వామి



సాతులూరు శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

**నరసరావుపేట ఈస్ట్:** కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శైవాలయాలు భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పాతూరులోని భీమలింగేశ్వర ఆలయం, రావిపాడు రోడ్డులోని కల్యాణ సుందరేశ్వర స్వామి ఆలయం, బరంపేటలోని వాయు మల్లేశ్వర ఆలయం, ఎన్‌ఎస్‌పి కాలనీ శివాలయం తదితర ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

**రొంపిచర్లలో...**

**రొంపిచర్ల:** మండల ప్రజలు కార్తిక సోమవారాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారు జామునే నదీ స్నానాలు చేసి ఆలయాలకు వెళ్లి దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లోని దేవతా మూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విప్పర్లలోని శ్రీ గంగాపార్వతీ సమేత వల్లభేశ్వర స్వామి ఆలయం, రొంపిచర్ల శ్రీ శంకరేశ్వరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని శ్రీ గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి, కొత్తపల్లిలోని శ్రీ హరిహర, తదితర దేవాలయాలు భక్తులతో నిండాయి. దేవాలయాలకు వచ్చిన భక్తులకు కొందరు భక్తులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

**నాదెండ్ల:** కార్తిక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పూజలు నిర్వహించి దీపారాధన చేశారు. సాతులూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. పూజారి పత్తిపాటి శ్రీధర్ స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మండలంలోని నాదెండ్ల, గణపవరం, ఎండుగుంపాలెం, ఇర్లపాడు, తూబాడు, కనపర్రు, చిరుమామిళ్ళ, అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాల్లోని ఆలయాల్లో కార్తిక మాస పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

**శావల్యాపురంలో...**

**శావల్యాపురం:** మండలంలోని గంటావారిపాలెం, కారుమంచి, మతుకుమల్లి, వేల్పూరు, శావల్యాపురం,పోట్లూరు, తదితర గ్రామాల్లో వేంచేసియున్న శివాలయాల్లో రెండవ కార్తికమాస వేడుకలు భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున చల్లని నీటితో పుణ్యస్నానాలు ఆచరించినభక్తులు స్వామి వారిని దర్శించుకొని మట్టి ప్రమిదల్లో, ఆవు నెయ్యి పోసి దీపాలు వెలిగించారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచి శివుడికు పంచమృత అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర విశేష పూజలు ఆలయ పూజారీ రావిపాటి సాయి భరత్ ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసాలు ఉన్నారు. మాల ధారణలో ఉన్న అయ్యప్పలు, శివమాల ,భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీకోదండరామ దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యుల సారథ్యంలో భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి దేవాలయంలో కార్తిక మాస వేడుకలు ఘనంగా నిర్వహించారు.

### న్యాయవాద గుమాస్తాల సంఘం అధ్యక్షుడిగా కాకర్ల చిన్నదానం



**వినుకొండ(నూజెండ్ల):** న్యాయవాద గుమాస్తాల సంఘం సర్వసభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షునిగా కాకర్ల చిన్నదానం, ప్రధాన కార్యదర్శిగా గుంజరి నరసింహారావు, కట్టెంపూడి మరియబాబు, ట్రెజరర్‌గా నర్రా దేవయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుమాస్తాల సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. నూతన కమిటీ సభ్యులను న్యాయవాదులు, సంఘం సభ్యులు అభినందించారు.

### ఉచిత ఇసుకను వెంటనే అందజేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్




**వినుకొండ(నూజెండ్ల):** పేద ప్రజలు తమ సొంత గృహాల నిర్మాణాల కోసం ఇసుకను ఎక్కువ డబ్బు పెట్టి కొనాల్సి వస్తుందని, ప్రభుత్వం చెప్పినట్లు ఉచిత ఇసుక దొరకడం లేదని ప్రభుత్వమే క్వారీలను నిర్వహించి ఉచిత ఇసుకను ప్రజలకు సరఫరా చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణ గృహనిర్మాణదారులు భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు పనులకు వెళ్లే మెట్ట ప్రాంతంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక ఇంత వరకు ప్రజలకు అందడం లేదని, వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకొని ప్రజలకు ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, కొండ్రముట్ల షేక్ చిన్న, సుభాని, శ్రీను, వెంకటేశ్వర్లు, కరిముల్లా, సైదా, మల్లికార్జునరావు, రమణమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థకు అబుల్ కలాం చిరస్మరణీయుడు



మౌలానా చిత్రపటానికి ఘన నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నాదెండ్లలో మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటరావు, విద్యార్థులు



ఎస్‌ఆర్‌కేటీ కాలనీ పాఠశాలలో అబ్దుల్ కలాం అజాద్‌కు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఎన్ఈసీలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**నరసరావుపేట:** భారతదేశ తొలి విద్యాశాఖమంత్రిగా విద్యావ్యవస్థకు పునాదులు వేసిన మహనీయులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. సోమవారం గుంటూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ గోపిరెడ్డితో పాటు పలువురు మైనార్టీ నాయకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి, పూలు చల్లి ఘనంగా నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. తొలి విద్యాశాఖ మంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో ప్రమాణస్వీకారం చేసి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో అనేక ప్రాంతాల్లో ఐఐటీ విద్యాసంస్థలు, యూనివర్సిటీలు ఏర్పాటు చేశారని చెప్పారు. అదేవిధంగా యూజీసీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం ద్వారా యూనివర్సిటీలకు నేరుగా నిధులు ఇవ్వడం ఆయన హయాంలోనే జరిగిందని పేర్కొన్నారు. విద్యా విధానంలో అనేక గొప్ప గొప్ప విద్యాసంస్థలను తీసుకొచ్చారని, ఈరోజు విద్యా విధానం ఆయన వేసిన పునాదులే కారణమన్నారు. సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టర్ మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ గొప్ప స్వాతంత్ర సమరయోధులని, చిన్న వయసులోనే పత్రిక నడిపి దేశ ప్రజల్లో స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. నాయకులు జిల్లా మైనార్టీ విభాగ కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాష, పొదిలే ఖాజా, మాజీ కౌన్సిలర్ జిలాని, జాఫర్, షేక్ మహబూబ్ బాషా, షేక్ జిలాని బాబా, పఠాన్ సుభాని, సయ్యద్ కరిముల్లా, అబ్దుల్ రజాక్, పంగులూరు విజయకుమార్, షేక్ సిలార్ భాష, సయ్యద్ బాషా, మిట్ట చిరంజీవి, ఎంఎస్ రెడ్డి పాల్గొని ఘనమైన నివాళులర్పించారు.

**మౌలానా అజాద్‌కు ఘననివాళులు**

**నాదెండ్ల:** స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్‌కలాం అజాద్ విశిష్టమైన సేవలందించారని హెచ్‌ఎం వెంకటరావు చెప్పారు. మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం మౌలానా అబుల్‌కలాం ఆజాద్ 136వ జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాతులూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరావు మాట్లాడుతూ 1888 నవంబర్‌లో జన్మించిన మౌలానా అజాద్ యుక్త వయస్సులో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా గాంధీజీతో కలిసి పోరాటం చేశారన్నారు. ఆయన హయాంలో విశిష్టమైన ఐఐఎం, ఐఐటీ లాంటి విద్యాసంస్థలు, ఎన్నో ఉన్నతమైన యూనివర్సిటీలు, విద్యా సంస్థలను ఏర్పాటు చేసి దేశ బంగారు భవితకు మార్గనిర్దేశం చేశారన్నారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

**ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం**

**నరసరావుపేట రూరల్:** జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం పలు కళాశాలల్లో నిర్వహించారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో భారతదేశ విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్య ద్వారా మార్పుకు ప్రేరేపించడం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ కె.పొన్నారి లక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి పీపీటీ ద్వారా జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి షేక్ కరీంమోహిద్దీన్, ఎండీ మస్తాన్‌షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌ఆర్‌కేటి కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గురులింగం పాల్గొని అబ్దుల్‌కలాం అజాద్ జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు.

## రెండు ప్రత్యేక శిబిరాల్లో ఒక్క అర్జీ రాలేదట!

**యడ్లపాడు:** రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఓటర్ల ముసాయిదా జాబితా తయారీకి రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు దీనికోసం ఈనెల 9,10 తేదీలలో మండలం పరిధిలో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు బీఎల్‌వోలు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. గతంలో జారీ అయిన ఓటర్ల కార్డులో చిరునామా, ఇతర వివరాలు తప్పుగా నమోదైతే వాటి మార్పుకోసం దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంది. కొత్తగా వచ్చిన వారి వివరాలను నమోదు చేసుకుంటారు. శిబిరాలను అయితే ఏర్పాటు చేశారుగాని ఆమేరకు పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లను చైతన్యం చేయడంలో మాత్రం అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు. రెండు రోజులు నిర్వహించిన శిబిరాల్లో ఒక్క దరఖాస్తు కూడా అధికారులకు అందక పోవడం దీనిపై ఏమేరకు ప్రచారం చేశారో అర్థం చేసుకోవచ్చు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా కేంద్రాల వద్ద అధికారులు ఉండి ప్రయోజనం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓటరు జాబితాలో సవరణలకు ఈ ఏడాదిలో చివరిసారిగా ఈనెల 23, 24 తేదీల్లోనూ మరో మారు ప్రత్యేక శిబిరాల నిర్వహించాల్సి ఉంది. అప్పుడైనా అధికారుల్లో మార్పు వస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

## బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న కె. ఉమారాణి

**రొంపిచర్ల:** బాలల హక్కులు, సమస్యలపై అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారిణి కె. ఉమారాణి అన్నారు. స్థానిక ఎండీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని అధికారులకు నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో, సేవ్ గర్ల్, చైల్డ్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని అందరూ అధికారులు వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పాటై ఎప్పటికప్పుడు పిల్లలు, వారి సమస్యలపై గ్రూప్‌లో షేర్ చేస్తూ ఉండాలన్నారు. ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 ప్రతి సచివాలయంలో అందరికీ కనపడేలా ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలను దత్తతు తీసుకునే అనుకునే వాళ్లు కారాపోర్టల్‌లో అప్‌లైన్ చేసుకోవాలన్నారు. బాలల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూసుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, తహసీల్దార్ బి. నిర్మల, ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.దేవీబాయి, ఎస్కే షమీమ్ సుల్తానా, కె. శశీదేవి, మండలంలోని అన్ని సచివాలయ పీఎస్‌లు, వెల్‌ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## సంస్కృతికి ప్రతీక వనభోజనాలు



వేడుకల్లో పాల్గొన్న భవిత సెంటరు విద్యార్థులు

**శావల్యాపురం:** కార్తికమాసంలో వన భోజనాలు నిర్వహించుకోవటం సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా ఉంటుందని ఎంఈవో పుసులూరి లలితాకుమారి అన్నారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో భవిత సెంటరు విద్యార్థులచే ప్రత్యేకంగా వన బోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో-2 లలితాకుమారి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు వలన ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. పండుగల విశిష్టత తదితర వాటిపై అవగాహన కల్గియుంటారన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-01 మద్దికుంట సాంబశివరావు, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి,భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి, పార్వతి, ఆర్. నాగమల్లేశ్వరి, ఎంఆర్‌సీ సిబ్బంది తివిక్రమ్, సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఏలిక శ్రీనివాసరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నాదెండ్ల:** గణపవరంలోని వెంకటకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ (కాటన్‌మిల్లు)లో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. బయ్యర్ బి రమేష్‌బాబు పత్తికొనుగోళ్ళు ప్రారంభించారు. తేమ శాతం 8 వరకూ ఉన్న పత్తికి క్వింటా రూ.7521లు గరిష్టంగా, 12 శాతం ఉన్న పత్తికి రూ.7200లు చొప్పున రైతులకు చెల్లించారు. 13 శాతం దాటిన పత్తిని తిరస్కరించారు. ఈ సందర్భంగా బయ్యర్ మాట్లాడుతూ రైతులు నిబంధనలకు అనుగుణంగా పత్తిని తరలించి మంచి ధర పొందాలని కోరారు. కాయ ఉన్న పత్తి రైతులు విడిల్చి ఆరబెట్టి గన్నీబ్యాగులు లేదా లూజుగా గానీ తరలించాలని కోరారు.

## కరాటే పోటీల్లో సత్తాచాటిన శావల్యాపురం విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో సంసిద్ స్కూలు ఉపాధ్యాయులు

**శావల్యాపురం:** ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు విద్యతో పాటు క్రీడాల్లో రాణించటం అభినందనీయమని సంసిద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒంటేరు నాగ సురేష్ అన్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామ పరిధిలో సంసిద్ పాఠశాల్లో క్రీడాల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10న గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన 9వ రాష్ట్రస్థాయి ఇన్విటేషనల్ జపాన్ షితో ర్యూ కరాటే స్కూల్ శుకొకై ఇజుషి వారి సారథ్యంలో 2024 పోటీల్లో సంసిద్ స్కూలు విద్యార్థులు సత్తా చూపటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈపోటీల్లో సంసిద్ పాఠశాల విద్యార్థులు 14 బంగారు పతకాలు,8 రజతాలు, 8 కాంస్య పతకాలు సాధించటం మంచి శుభాపరిణామమన్నారు. ఈకార్యక్రమంలో కరాటే మాస్టర్ (బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్) ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పట్టపగలు ఇంట్లో నగదు చోరీ

**చిలకలూరిపేట టౌన్:** పట్టణంలో పట్టపగలు ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుగాలీ కాలనీలో నివాసం ఉండే జరపాల శ్రీనివాస నాయక్ గతంలో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి పని చేసి ప్రస్తుతం ఖాళీగానే ఉంటున్నాడు. భార్య హెల్త్ డిపార్టుమెంట్‌లో చిరుద్యోగిగా విధులు నిర్వహిస్తోంది. ఇద్దరి సంతానంలో ఒకరు ఉద్యోగం నిమిత్తం, మరొకరు విద్య నిమిత్తం వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. దీంతో ఇంట్లో దంపతులు మాత్రమే ఉంటుండగా సోమవారం ఉదయం 8.40 సమయంలో భార్యను డ్యూటీ పనుల నిమిత్తం కావూరు వెళ్లి వదిలిపెట్టి వచ్చాడు. అప్పటికే ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి గమనించాడు. బీరువా తెరిచి ఉండటంతో పాటు అందులోని రూ.10వేల నగదు కనిపించక పోవడంతో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ధర్నాను జయప్రదం చేయండి

**రొంపిచర్ల:** మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై 14వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ సరికొండ వెంకటేశ్వరరాజు పిలుపునిచ్చారు. మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పోరు ప్రచార యాత్ర సందర్భంగా కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్‌లు ఇవ్వాలన్నారు. రైతాంగానికి నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలన్నారు. 14వ తారీకు ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతగుడిపాడు సీపీఎం శాఖ సభ్యులు కొత్తపల్లి యాకోబు, మూకుడు పాపయ్య, రొంపిచర్ల సీపీఎం శాఖ కార్యదర్శి అంగులూరి ఫణీంద్ర, పలపల రామిరెడ్డి, పంబా కోటేశ్వరరావు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.